
# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





సమైక్య పాలనలో భూ రికార్డుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేది. భూమి అనుభవదారు ఒకరుంటే, రికార్డుల్లో పట్టాదారు మరొకరు, కబ్జాదారు ఇంకొకరు ఉండేవారు. వీఆర్‌ఓ మారిండంటే కబ్జా కాలంలో పేర్ల మార్పులు, పాస్ పుస్తకాల్లో భూమి హెచ్చుతగ్గులు ఉండేవి. ఫలితంగా నిత్యం పోలీస్‌స్టేషన్లలో కేసులు, కోర్టుల్లో దావాలు వేసే పరిస్థితి. అలాంటి పరిస్థితిని స్వరాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా తాసీల్దార్‌కు రెవెన్యూ అధికారాలు అప్పగించి పది నిమిషాల్లోనే భూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఈ పోర్టల్‌తో నేడు భూ సమస్యలన్నీ పరిష్కారమవడమే కాకుండా లెక్కలన్నీ రికార్డుల్లో భద్రంగా ఉన్నాయి. అలాంటి ధరణిని తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యానించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ పాత పద్ధతులతో భూ పంచాయతీలు పెరుగుతాయని, దళారీ వ్యవస్థ వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధరణి కొనసాగేందుకు సీఎం కేసీఆర్‌కు అండగా ఉంటామని తేల్చి చెబుతున్నారు.

## ధరణి పోతే దళారీలదే పెత్తనం

### కాంగ్రెస్ నేతలపై రైతన్న కన్నెర్ర

**ధరణి పోతే మళ్లీ దరిద్రం పట్టినట్టే**

కాంగ్రెసోళ్లు ధరణిని ఎత్తివేయాలని చూస్తున్నరు. ఒకవేళ ధరణిని తీసేస్తే రైతులకు దరిద్రం పట్టినట్టే. ధరణి వచ్చిన తర్వాతనే భూమి లెక్కలు ఆన్‌లైన్‌లో పక్కాగా ఉన్నాయి. గుంట భూమి తేడా లేకుండా చేసింన్రు. ధరణి లేనప్పుడు ఎక్కువ, తక్కువ భూముల కోసం పటేల్, పట్వారీలు, పెద్దమనుషుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అప్పుడు మా తండ్రులను పెట్టిన తిప్పలు ఇప్పుడు మాకు పెట్టాలని చూస్తే ఊరుకునేది లేదు. ధరణి తీసేస్తే భూ సమస్యలు మళ్లీ మొదటికే వస్తాయి. ధరణిపై అవగాహన లేకుండా రైతులను ఇబ్బంది పాలు చేసేందుకే కాంగ్రెసోళ్లు కుట్ర చేస్తున్నరు. ధరణితో రైతులు పొందిన లాభం ఏమిటో తెలియని, ధరణిపై అవగాహన లేని వాళ్లు ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం సరికాదు. ధరణి ఎత్తివేయాలని చూస్తే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదు.

–గంగదేవి సాగర్, రైతు, పక్కీర్‌గూడెం, బొమ్మలరామారం



**మళ్లీ పైరవీలు, దళారులు..**

కాంగ్రెస్ హయాంలో లంచాలు ఇచ్చి ఆఫీసుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా పట్టా మార్పిడి అయ్యేది కాదు. గ్రామ పెద్దను తీసుకెళ్లినా పని జరిగేది కాదు. ఒకరి భూములు మరొకరి పేరు మీద రిజిస్ట్రేషన్ అయ్యేవి. తరచూ పంచాయతీలు, కేసులు అయ్యేవి. ధరణితో అలాంటి సమస్యలన్నీ తీరినయ్. మోసాలు తగ్గినయ్. భూముల ధరలు కూడా పెరిగాయి. అలాంటి ధరణిని కాంగ్రెసోళ్లు రద్దు చేస్తామనడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ధరణి తీసేస్తే రైతుల బతుకులు ఆగం కావడం గ్యారంటీ. ధరణి తీసేస్తే మోసాలు, పైరవీలతో దందాలు చేయవచ్చని చూస్తున్నరు. వారికి రైతులంతా కర్రు కాల్చి వాత పెట్టాల్సిందే.

–గూడూరు జంగారెడ్డి, రైతు, పెద్దకొండూర్, చౌటుప్పల్



**ధరణి లేకపోతే రైతులు ఆగమే..**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెచ్చిన ధరణి పోర్టల్‌తో రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరాయి. అవకతవకలకు తావు లేకుండా పాస్ పుస్తకాలు అందుతున్నాయి. గతంలో వీఆర్‌ఓలు ఉన్నప్పుడు రైతులను ఎంతో వేధించేవారు. భూ రికార్డులు ఆగమాగం ఉండేవి. వీఆర్‌ఓల నిర్లక్ష్యంతో ఒకరి భూమి మరొకరికి రాసేవారు. పట్టా కాలంలో ఒకరి పేరు ఉంటే, కబ్జా కాలంలో మరో పేరు ఉండేది. పట్వారీల కాలంలో గ్రామంలో నిత్యం గొడవలు జరిగేవి. నాడు వీఆర్‌ఓలు ప్రతి పనికి డబ్బులు డిమాండ్ చేసేవారు. నేడు ధరణి పోర్టల్‌తో ఎక్కడి నుంచి అయినా సరే రికార్డులను చూసుకోవచ్చు. ధరణి పోర్టల్ తీసుకొచ్చిన సీఎం కేసీఆర రైతుల పాలిట దేవుడు. తాము అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తామంటున్న కాంగ్రెస్ నాయకులతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి.

–జూపల్లి బాలయ్య, రైతు, సోలిపేట, బొమ్మలరామారం



**ధరణి పోతే దరిద్రం చుట్టుకున్నట్టే..**



రైతులు భూ సమస్యలపై రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగకుండా సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ తీసుకొచ్చి మేలు చేశారు. గతంలో భూ క్రయ, విక్రయాల తర్వాత పట్టాల కోసం అధికారుల చుట్టూ తిరగలేక విసుగొచ్చేది. ఇప్పుడు ధరణితో భూమి కొనడం, అమ్మడం సులువుగా జరిగిపోతున్నాయి. పహాణి కావాలంటే ఆన్‌లైన్‌లో క్షణాల్లో తీసుకునే వెసులుబాటు ఉంది. కాంగ్రెసోళ్లు వస్తే ధరణి తీసేస్తామంటున్నారు. దాంతో మళ్లీ భూమి వివరాల్లో అవకతవకలకు ఆస్కారం ఉంటుంది. ధరణి తీసేస్తే రైతులకు దరిద్రం చుట్టుకున్నట్లే. ధరణి ఉండాలంటే కేసీఆర్‌కు అండగా నిలవాలి.

–కందడి వెంకట్‌రెడ్డి, తిలోనుబావి, ఆత్మకూరు(ఎం)

**ధరణి తీసేస్తే గొడవలే..**

ధరణి తీసేస్తే మళ్లీ కౌలు రైతులు, రైతుల మధ్య గొడవలు వస్తాయి. రైతులు అగ్రిమెంటు రాసివ్వరు. కౌలు రైతులు అగ్రిమెంటు రాసివ్వాలని అంటారు. ప్రతి సంవత్సరం కౌలు రైతులు మారుతూ ఉంటారు. ఒక్కోసారి ఒక్కో కౌలు రైతు భూమిని కౌలుకు తీసుకుంటారు. ఏ లెక్కన కౌలు రైతుకు నగదు పంపిణీ చేస్తారు? ఇంతకు ముందు ఒకరి భూమిని మరొకరి పేరున రాసి పట్వారీలు రైతులను గోసపెట్టేటోళ్లు. ఇప్పుడు ధరణితో అలాంటి బాధలన్నీ పోయినయ్. రైతు సంతకం పెడితే తప్ప భూమి వేరే వారి పేరుపై ఎక్కదు. అలాంటి ధరణిని తీసేస్తే కొరివితో తలగోక్కున్నట్టే అయితది. రాజకీయాల కోసం కౌలు రైతులు, రైతుల మధ్య గొడవలు పెట్టొద్దు. సంతోషంగా ఉన్న రైతుల నోట్లో మట్టి కొట్టొద్దు.

–ఎర్ర ముత్యాలు, పీపల్‌పహాడ్, చౌటుప్పల్



**కాంగ్రెస్ వస్తే కష్టాల పాలే..**

కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన ధరణితో రైతులకు భూములపై భరోసా పెరిగి దర్జాగా బతుకుతున్నాం. కలెక్టరు కాదు కదా, ముఖ్యమంత్రి చెప్పినా భూమి మరొకరి పేరు మీద మారే అవకాశం లేదు. గతంలో భూమిని సాగు చేసేదొకరు, కాస్తులో ఉండేది మరొకరు. మధ్య దళారులు పైసలు తీసుకొని ఇష్టమొచ్చినట్లు రికార్డులు మార్చి రైతులను పరేషాన్ చేస్తూ కార్యాలయాల చుట్టూ తిప్పుకునేవారు. నీరు కరెంట్‌లేక అష్టకష్టాలతో పంటలు పండించుకోవడం ఒక ఎత్తయితే, ఆ భూమిని కాపాడుకోవడం మరోఎత్తు. పహాణి కావాలంటే పైసలే, 1బీ కావాలన్నా పైసలు పెట్టి చెప్పులరిగేలా తిరగాల్సి వచ్చేది. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో రైతుల కష్టాలు, బాధలు తీరినయ్. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కష్టాలపాలు కావాల్సిందే. అయినా వారి మాటలు నమ్మేది లేదు. తిరిగి అధికారం కేసీఆర్‌దేకేసీఆర్‌దే.

–ఆవుల సత్తయ్య, నీర్నెంల, రామన్నపేట






**మళ్లీ అప్పటి కష్టాలు పడలేం**

కాంగ్రెస్ హయాంలో రాత్రిపూట బావుల దగ్గర పడుకునేటోళ్లం. ఎప్పుడు కరెంటు వస్తదో, ఎప్పుడు పోతదో తెలియని పరిస్థితి. రాత్రిపూట వచ్చే కరెంటుతో ఎంతోమంది కరెంటు షాక్, పాము కాటుకు గురై చనిపోయారు. కరెంట్ సరిగ్గా రాక పంటలు ఎండిపోయేవి. తెలంగాణ వచ్చాక 24 గంటల కరెంటు వస్తుండడంతో రైతులు తమ ఇష్టం వచ్చినప్పుడు రైతులు నీళ్లు పారించుకుంటున్నారు. వ్యవసాయం మంచిగా కొనసాగుతూ రైతులు రాజుగా బతుకుతున్నరు. రైతుబంధుతో పెట్టుబడికి ఎకరాకు రూ.10 వేలు ఇచ్చి ఆదుకుంటున్నారు. విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచి పంటలకు మద్దతు ధర కల్పిస్తున్నారు. కాంగ్రెస్ వస్తే 50 ఏండ్లు మళ్లీ వెనక్కి పోవాల్సిందే. రైతులకు 3 గంటల కరెంట్ ఇస్తే మళ్లీ ఆత్మహత్యలు మొదలవుతాయి. కేసీఆర్‌ను గెలిపించుకుంటేనే రైతులు బాగుపడతరు.

–ఎవితె రాములు, రైతు, పటేల్‌గూడెం, ఆలేరు రూరల్



**కాంగ్రెస్‌ను నమ్మితే ఖతమే..**

తెలంగాణ రాష్ట్రం వచ్చినంక మా బతుకులు సాఫీగా సాగుతున్నాయి. కేసీఆర్ సార్ సీఎం అయినంక వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్నారు. తాగు, సాగునీళ్లు పుష్కలంగా ఉన్నాయి. కాంగ్రెస్ హయాంలో ఏనాడూ సక్రమంగా కరెంటు ఉండేది కాదు. ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. వచ్చిన కరెంట్ కూడా దీపం కంటే అధ్వానంగా ఉండేది. లోఓల్టేజీతో మోటర్లు, స్టార్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేవి. ఎకరం పొలం నాటేస్తే సగం ఎండిపోయేది. స్వరాష్ట్రంలో 24 గంటల నాణ్యమైన కరెంట్ వస్తుండడంతో వ్యవసాయం సాఫీగా సాగుతుంది. మళ్లీ కాంగ్రెస్ వస్తే మంచిగా వచ్చే కరెంటు ఖల్లాస్ కావాల్సిందే.

–తోకల కనకయ్య, రైతు, తిరుమలాపురం, తుర్కపల్లి



## మూడు గంటలనోళ్ల మాడు పగులగొడుతం

### హస్తానికి ఓటేస్తే కష్టాలు కొనితెచ్చుకున్నట్టే

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు ఇస్తుంటే కాంగ్రెస్ తట్టుకోలేకపోతున్నది. రైతులు సంతోషంగా వ్యవసాయం చేస్తూ ఆనందంగా ఉండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నది. సాగుకు 3 గంటల కరెంట్ చాలని, రైతులు 10హెచ్‌పీ మోటర్లు వాడాలని ఉచిత సలహాలు ఇస్తున్నది. కాంగ్రెస్ అర్థం లేని మాటలపై రైతులు మండిపడుతున్నారు. మూడు గంటలనోళ్ల మాడు పగులగొడుతామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్నదాతను ఆగం చేయడమే లక్ష్యంగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులకు ఎన్నికల్లో షాక్ ఇస్తామని హెచ్చరిస్తున్నారు.

**కాంగ్రెసోళ్లది ఓర్వలేని తనం**

సీఎం కేసీఆర్ పాలనలో ఇప్పుడిప్పుడే రైతులు ఆనందంగా వ్యవసాయం చేసుకుంటున్నారు. రైతులు మంచిగైతుంటే కాంగ్రెసోళ్లు ఓర్వలేక పోతున్నరు. ఎలాగైనా ఆగం చేయాలని చూస్తున్నరు. అందుకే 3 గంటల కరెంట్ చాలని, ధరణి రద్దు చేస్తామని ఇష్టమొచ్చినట్లు మాట్లాడతున్నరు. నాడు రైతులను పీల్చి పిప్పి చేసి ఇబ్బందులకు గురిచేసిన కాంగ్రెస్ పాలన దరిద్రమైనది. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెప్పే కాంగ్రెసోళ్లకు కనీసం వ్యవసాయంపై అవగాహన కూడా లేదు. 10 హెచ్‌పీ మోటర్లకు మస్తు ఖర్చు అవుతది. అది ఎవరు భరించాలే? ప్రస్తుతం కరెంట్ బాగా ఉంటుంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ చీకటి రోజులే వస్తాయి. నాణ్యమైన కరెంట్ ఇచ్చి రైతులకు ఎంతో మేలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కే రైతుల మద్దతు ఉంటుంది.

–యగమాటి అంజిరెడ్డి, రైతు, అమ్మనబోలు, మోటకొండూర్



**కాంగ్రెస్‌ది దుర్మార్గమైన చర్య**

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మాటలు నమ్మి రైతులు మోసపోవద్దు. రైతులకు 3 గంటల కరెంటు చాలని, 10 హెచ్‌పీ మోటర్లు వాడలని చెప్పడం దుర్మార్గమైన చర్య. 3 గంటల కరెంటు ఇస్తే రైతులు వ్యవసాయం చేయలేరు. వ్యవసాయం గురించి తెలిసిన వాళ్లు ఇలా మాట్లాడరు. తెలంగాణ ప్రభుత్వం 24 గంటల కరెంటు ఇవ్వడం వల్ల 5 హెచ్‌పీ మోటర్లతో మంచి పంటలు పండిస్తున్నాం. 10హెచ్‌పీ మోటర్లు పెడితే ఎకరం పారే లోపు నీళ్లు అయిపోతాయి. రైతులంతా పెద్ద పెద్ద మోటర్లు వాడితే ట్రాన్స్‌ఫార్మర్‌పై భారం పడి పేలి పోతుంది. రైతులు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టడం నా జీవితంలో చూడలే. కాంగ్రెస్ వాళ్లని నమ్ముకుంటే మళ్లీ మోసపోయి గోసపడతాం. వారికి తగిన గుణపాఠం చెప్పాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాలి.

–వారాల రామచంద్రారెడ్డి, రైతు, శివారెడ్డిగూడెం, భూదాన్‌పోచంపల్లి



**3 గంటల కరెంటుతో సాగు సాగదు**

కాంగ్రెస్ వస్తే 3 గంటల కరెంట్ ఇస్తామంటుంది. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోమటుంది. ఇది అయ్యే పనేనా? 3 గంటల కరెంటుతో వ్యవసాయం సాగవుతదా? వ్యవసాయం చేసేటోడికి తెలుస్తది ఆ బాధ. 24 గంటల కరెంట్ ఇచ్చే కేసీఆర్ ప్రభుత్వానికి వదులుకొని మళ్లీ వెనుకటి బాధలు కొని తెచ్చుకోలేం. 10హెచ్‌పీ మోటరు కొనలాంటే లక్షకు పైగా డబ్బులు కావాలి. ఇది కొనుగోలు చేసే సామర్థ్యం రైతులకు ఉండదు. ఈ మోటర్లు పెట్టి వ్యవసాయం చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయి బీడు భూములే మిగులుతాయి. 24 గంటల కరెంట్ ఇచ్చే ప్రభుత్వమే రావాలి.

–ఎడ్ల రాంచంద్రారెడ్డి, వెల్లంకి, రామన్నపేట



**3 గంటల కరెంటుకు 3 గుంటలు పారదు**



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 3 గంటల కరెంటు ఇస్తామని అంటున్నారు. 3 గంటల కరెంటుకు 3గుంటల పొలం కూడా పారదు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఇస్తున్న 24 గంటల ఉచిత కరెంట్‌తో పంటలు బాగా పండుతున్నాయి. కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతులకు కష్టాలు మొదలవుతాయి. 10 హెచ్‌పీ మోటర్లను పెడితే గంటలోనే బోర్లు, బావుల్లోని నీళ్లు అడుగంటి పోతాయి. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కష్టాలు కొని తెచ్చుకున్నట్టే. రైతులను రాజు చేస్తున్న సీఎం కేసీఆర్ వెంటే మేమంతా ఉంటాం.

–ఎర్ర వెంకట్‌రెడ్డి, రైతు, పోతిరెడ్డిపల్లి, ఆత్మకూరు(ఎం)

**కాంగ్రెసోళ్లవి ఇజ్జత్ లేని మాటలు**



కరెంట్‌పై కాంగ్రెసోళ్ల మాటలు వింటుంటే మళ్లీ పాత రోజులు వస్తాయని భయమేస్తుంది. కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోసం పడ్డ తిప్పలు గుర్తొస్తే బాదేస్తది. ఇప్పుడు మళ్లీ 3 గంటల కరెంటు చాలని పేర్కొనడం సిగ్గుచేటు. కాంగ్రెస్ నాయకులవి ఇజ్జత్ లేని మాటలు. 3 గంటల్లో 3 గుంటల పొలం కూడా పారదు. రైతులంతా ఒకేసారి మోటర్ పెడితే ఓవర్‌లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతుంది. రిపేర్ చేసేందుకు మళ్లీ మూడు దినాలు పడిగాపులు కాయాల్సిందే. మాయదారి కాంగ్రెస్ రాకుండా చేస్తేనే రైతులకు మేలు జరుగుతుంది. వాళ్లు వస్తే మళ్లీ వెనుకటి రోజులే వస్తాయి. సీఎం కేసీఆర్ సారుతోనే నిరంతర కరెంట్ సాధ్యం.

–కొండ ప్రభాకర్‌రెడ్డి, జాల, రాజాపేట